RNI NO: TEL/TEL/2009/28544

సంపుటి : 18 సంచిక : 127

Vol : 18 Issue : 127



# పీపుల్స్ డైరీ

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, మంగళవారం 14 జూలై 2026
Warangal, Tuesday 14 July 2026

పేజీలు : 08 వెల రూ : 4-00

Pages : 08 Price : 4-00

WANTED


పీపుల్స్ డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

♦ హనుమకొండ ♦ కరీంనగర్ ♦ భూపాలపల్లి ♦ పెద్దపల్లి/రామగుండం ♦ జనగామ ♦ మహబూబాబాద్ ♦ హైదరాబాద్ ♦ నిజామాబాద్

Cell : 9493019044
9618509859

## ఏజెన్సీలో అవినీతి గుట్టు



అక్రమాల్లో రాముడి నైపుణ్యం

ఇన్‌చార్జి తహసిల్దార్ లీలలు చూద్దామా..!

ప్రభుత్వ భూముల ఆక్రమణలో మాజీ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు

మండలంలో ప్రభుత్వ భూములపై గద్దల్లా వాలిపోతున్న వైనం

సృష్టించిన నకిలీ కాగితాలకు వారసత్వ పట్టాలు మంజూరు

అన్నీ తెలిసి కూడా ఉన్నతాధికారులు మౌనం వహిస్తున్నారా?

తప్పు చేసిన అధికారులపై చర్యలు ఎందుకు లేవు?

అందరికీ సమ న్యాయం చేయని అధికార యంత్రాంగం?

ప్రజల్లో అప్రతిష్ట మూటగట్టుకుంటున్న అధికారులు

ములుగు ప్రతినిధి, జూలై 13(పీపుల్స్ డైరీ) : ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలంలో ఇన్‌చార్జి తహసిల్దార్ చేసిన అవినీతి గుట్టు వెలుగుచూసింది. 1/70 చట్టం పరిధిలో గల ప్రభుత్వ భూములకు కూడా విచ్చలవిడిగా పట్టాలు మంజూరు చేసి, గిరిజన చట్టాలను సమాధి చేశారు. విధులు చేపట్టిన కొద్ది నెలల వ్యవధిలోనే ఏజెన్సీ చట్టాల తలరాతను మార్చి పాపకారిగా అవతారం ఎత్తాడు.

కేవలం రెండు సర్వే నంబర్లలోనే సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని, అక్రమార్కుల చేతికి పట్టాలు అందించి, అవినీతిలో తన సత్తాను చాటాడని రెవెన్యూ రికార్డులే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. కాగితాల్లో 1/70 చట్టం చెప్పే షరతులు, పరిమితులు ఏజెన్సీలో అమలు కావడం

(మిగతా 2లో...)



» జలాశయాల్లో అడుగంటిన నీటి నిల్వలు

» పాతాళంలోకి పడిపోయిన భూగర్భజలాలు

» మెజార్టీ ప్రాంతాల్లో తలెత్తనున్న తీవ్ర సాగు, తాగునీటి ఎద్దడి

» సంక్షోభాన్ని ఎదుర్కొనేదెలా...?

» వరుణుడు కరుణిస్తేనే ఉపశమనం

## డేంజర్ బెల్స్..

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో తాగునీటి పరిస్థితి రోజురోజుకూ తీవ్ర ఆందోళనకరంగా మారుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం.. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. భూగర్భ జలమట్టాలు కూడా క్రమంగా పడిపోతుండటంతో రానున్న నెలల్లో తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే 123 శుద్ధి కేంద్రాలకు రాష్ట్రంలోని 29 ప్రధాన జలాశయాలు ఆధారంగా ఉన్నాయి. ఈ 29 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం కేవలం 333.44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయంలో 522.31 టీఎంసీల నిల్వలు ఉండగా.. గతంతో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత దిగజారినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఉత్తర తెలంగాణలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి పైన వినియోగించదగిన నీరు కేవలం 3 టీఎంసీలే మిగిలి ఉండగా.. ప్రతి నెల తాగునీటి అవసరాలకు సుమారు అర టీఎంసీ అవసరం అవుతోంది.

(మిగతా 2లో...)



## ప్రయాణీకుల చేతివాటం

### రైళ్లలో 1.27 కోట్ల టవల్‌లు, దుప్పట్లు చోరీ..

» ఏసీ కోచ్‌లలో బెడ్‌రోల్ సామగ్రి మాయం

» రైల్వేకు వంద కోట్ల గాయం » ప్రజా ఆస్తుల పట్ల ఇంత నిర్లక్ష్య ధోరణా?

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : భారతీయ రైల్వేలోని రైళ్ల ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే బెడ్‌రోల్ సామగ్రి భారీ స్థాయిలో చోరీకి గురవుతోంది. కొవిడ్ అనంతరం 2022 జనవరి నుంచి 2026 మే వరకు నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా టవళ్లు, దిండ్లు, దుప్పట్లు వంటి కనీసం 1.27 కోట్ల వస్తువులు మాయమైనట్లు ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తుకు 69 రైల్వే డివిజన్లలో 54 డివిజన్లు స్పందించగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రజా ఆస్తులపట్ల నిర్లక్ష్య ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని విమర్శలు వస్తున్నాయి.

ఆర్‌టీఐ వివరాల ప్రకారం.. గడిచిన నాలుగేళ్లలో టవల్‌లు, దిండ్లు, దుప్పట్ల వంటి వస్తువుల చోరీ కారణంగా బెడ్‌రోల్ కాంట్రాక్టర్లకు సుమారు రూ.104.51 కోట్ల నష్టం వాటిల్లింది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఇలాంటి దొంగతనాలు 56 శాతం పెరిగినట్లు వెల్లడైంది.

(మిగతా 2లో...)



## ఫలించిన 15 ఏండ్ల నిరీక్షణ!


కృత్రిమంగా గుడ్లు పొదిగి మూడు నాగుపాము పిల్లల సృష్టి!

ఢిల్లీలోని నేషనల్ జూలాజికల్ పార్క్‌లో ప్రయోగం

సరీసృపాల సంరక్షణలో దక్కిన విజయం

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రసిద్ధ నేషనల్ జూలాజికల్ పార్క్ (ఎన్‌జెడ్‌పీ – ఢిల్లీ జూ) సరీసృపాల సంరక్షణలో ఒక చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. గత 15 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. జూ చరిత్రలోనే అత్యంత అరుదైన రీతిలో మూడు ఇండియన్ కోబ్రా పిల్లలు జన్మించాయి. సైంటిఫిక్ యానిమల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిపుణులైన వెటర్నరీ వైద్య బృందం పర్యవేక్షణలో చేపట్టిన కృత్రిమంగా గుడ్లు పొదిగే ప్రక్రియ అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చింది. దశాబ్ద కాలానికి పైగా ఈ జాతి పాముల పునరుత్పత్తి విషయంలో ఎదురవుతున్న విఫలయత్నాలకు స్వస్తి పలుకుతూ ఈ అరుదైన విజయం దక్కడం విశేషం కాగా.. అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీ జూ డైరెక్టర్ ఈ సంతోషకరమైన వార్తను అధికారికంగా వెల్లడించారు. జూలోని జంతు సంరక్షణ, వెటర్నరీ విభాగాల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ కోబ్రా గుడ్లను ప్రత్యేక నియంత్రిత (మిగతా 2లో...)





## సైకో కిల్లర్ ఆత్మహత్య

షాబాద్ ఆరు హత్యల నిందితుడు రాజ్‌కుమార్ మృతి..

మేనమామ గ్రామంలో ఆత్మహత్య

పంజర్ల గ్రామ శివారులో మృతదేహం

తప్పించుకునే అవకాశం లేక సూసైడ్

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్.. సూసైడ్ చేసుకున్నాడు. తన మేనమామ ఊరు అయిన కొత్తూరులోని ఓ వెంచర్ వద్ద రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించగా.. రంగంలోకి దిగిన అధికారులు.. అక్కడ పరిశీలన చేశారు. ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన

(మిగతా 2లో...)



## దేవాదుల ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

▪ ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదు ▪ 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతాం
▪ దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం
▪ 38.16 టీఎంసీల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తాం ▪ భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
▪ రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం ▪ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణ అమలు
▪ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేశాం ▪ సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
▪ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క

7లో

పీపుల్స్ డైరీ
వరంగల్
మంగళవారం, 14 జులై 2026
సంపుటి : 18, సంచిక : 127


# ఏజెన్సీలో అవినీతి 'గుట్టు'

(మొదటి పేజీ తరువాయి)

లేదని చెప్పడానికి, వెంకటాపురం మండలంలో ఇంచార్జ్ తహసిల్దార్ చేసిన పనులే నిదర్శనంగా మారాయి.

వాడగూడెం (జెడ్)116, మరికల (జెడ్)9 సర్వే నంబర్లు రెండింటిలోనే ఇంత ఘోరంగా అవినీతి చోటుచేసుకుంటే, మండలంలో ఇంకెన్ని దారుణాలు (ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చడం) చేసి ఉంటారో తలుచుకుంటేనే ఊహించడానికి కష్టతరం అవుతుంది.

గిరిజన ప్రాంతాల్లో హక్కుదారులైన ఆదివాసీలు సేద్యంలో ఉన్న భూములకు, పట్టాలు పొందాలంటే అసైన్మెంట్ జరగాలని, ప్రస్తుతం సాధ్యపడదని చెప్పే అధికారులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు మాత్రం ఎటువంటి షరతులు వర్తింపచేయకుండా, చాలా సులభంగా పట్టాలు అందించడంలో ఉన్న రహస్యం ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఆ రహస్యం సమాజంలో తిరుగుతున్నప్పటికీ, తప్పు సరిదిద్దాల్సిన ఉన్నతాధికారుల నిజాయితీ అక్రమార్కుల వద్ద మోకరిల్లిందన్న నిందలకు అడ్డుకట్ట వేయకపోవడం, ప్రజల్లో మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తుందని చెప్పాలి.

మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూములు ఉంటే అక్కడ గద్దల మాదిరిగా వాలిపోతారని గతంలో ఆరోపణలు మాత్రమే ఉండేవి. కానీ కళ్ళ ముందర కనిపిస్తున్న భూములకు పట్టాలు సాక్ష్యాలుగా నిలవడంతో, ఆరోపణలు నిజమని తేలింది. కుటుంబ సభ్యులు మొదలుకొని అనుచరుల అక్రమ పట్టాలు వరుసగా ఒకరికి 16, ఇంకొకరికి 10, అనుచరుడికి 20 ఎకరాలతో పాటు, వీరి కబ్జాలో మరో 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఘనకార్యం అంతా కూడా ఒకే తహసిల్దార్ కూడా ఇంచార్జ్ హయాంలో పట్టాలుగా నామకరణం జరగటం ఆశ్చర్యంతో పాటు, ఆందోళన కలిగిస్తుందని చెప్పొచ్చు.

అధికారులు, అక్రమార్కులు కలిసి ఫన్నిన కుట్రలపై ఎన్నో విధాలుగా ఉన్నతాధికారుల దృష్టికి చేరిందని చెప్పాలి. కానీ తప్పుడు పనులు చేసిన అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా, అక్రమార్కులపై సానుభూతి ఉన్నట్లు చూపే మౌనం ప్రజల్లో ఉన్నతాధికారులపై మచ్చను మిగులుస్తుంది.

**తప్పుడు అధికారులపై చర్యలు శూన్యం..**

గతంలో ఇదే వెంకటాపురం మండలంలో పనిచేసిన మరి కొందరు తహసీల్దార్లు అవినీతి పనులు చేసినట్లు రుజువు అయింది. సమ్మయ్య అనే తహసీల్దార్ వీరభద్రవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి, వేరొకరి పట్టాను అతడి పేరు మీదికి మార్చి అవినీతికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో విషయం బయటపడింది. ఇంకొక తహసీల్దార్ అంటే నాగరాజు ఇప్పగూడెం లంక భూముల్లో గిరిజనలను విస్మరించి, పట్టా ర్యాంపు నిర్వహణ కోసం బరితెగించి, తప్పుడు నివేదికను ఇచ్చి దోపిడికి సహకరించారు. ఈ విషయంపై బలమైన ఆరోపణలు వెల్లువెత్తడంతో అప్పటి తహసిల్దార్ లక్ష్మీరాజయ్య కలెక్టర్ కు అవినీతి జరిగిందనే నివేదికను కూడా పంపినట్లు తెలిపారు. కానీ వారిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు గట్టు రాము వంటల ఎకరాల ప్రభుత్వ భూమికి అక్రమ పట్టాలు అందించి అవినీతికి పాల్పడ్డట్లు రుజువు అవుతుంది. ఈ విధంగా ఒకరు తర్వాత మరొకరు చేసిన అవినీతి భాగోతం బయట పడుతున్నప్పటికీ, ఉన్నతాధికారులు నోరు మెదపకపోవడం, ముమ్మాటికీ అధికారులపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని కోల్పోవడమే అవుతుంది.

పై సర్వే నెంబర్లు రెండింటిలో కూడా ఉన్న ప్రభుత్వ భూమిలో ఎందరో మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు సాగులో ఉన్నప్పటికీ, వారెవరికీ భూమి హక్కు పత్రాలు రాకుండా కేవలం ఆర్థికంగా బాగా బలిసిన వ్యక్తులకే పట్టాలు అందించేందుకే మొగ్గు చూపడం సిగ్గుచేటు. సామాన్యులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడంలో మాత్రం అధికారులు విఫలం అవుతున్నారు. ఈ విధంగా వ్యక్తులను బట్టి, వారి ఆస్తులను బట్టి న్యాయం అందించే అధికారుల వలన మిగిలిన వారందరూ కూడా ప్రజల్లో అప్రతిష్టను మూట కట్టుకోవడమే అవుతుంది.

# సైకో కిల్లర్ ఆత్మహత్య!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారంలో రాజ్‌కుమార్ పోక్సో కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఈ ఘటనతో కోపం పెంచుకున్న రాజ్‌కుమార్.. బాధిత బాలికతోపాటు తల్లి, నానమ్మను.. తన భార్య, ఇద్దరు పిల్లలను కలిపి మొత్తం ఆరుగురిని ఒకే రాత్రిలో అతి కిరాతకంగా హతమార్చాడు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అక్కడికి చేరుకుని మృతుడిని గుర్తించారు. షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్ అని గుర్తించారు. రాజ్‌కుమార్ మృతదేహం పక్కనే విషం బాటిల్ లభ్యం కావడంతో.. అతడు పాయిజన్ తాగి చనిపోయినట్లు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగురిని చంపేయడంతో తనను పట్టుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ పడుతుండటంతో తీవ్ర భయాందోళనలకు గురై.. ఎటూ తప్పించుకుని పోయే అవకాశం లేకపోవడంతో అతడు పురుగుల మందు తాగి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక హత్యలు చేసిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు సుమారు 14 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పోలీసుల గాలింపు చర్యలు తీవ్రం కావడంతో అతడికి ఎక్కడా ఆశ్రయం దొరకలేదని.. చివరికి కొత్తూరు మండలంలోని తన మేనమామ ఊరైన పంజర్లకు చేరుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ గ్రామ శివారులోనే పురుగుల మందు తాగి చనిపోయినట్లు పేర్కొంటున్నారు.

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో ఒకే రాత్రి ఆరుగురిని అతి దారుణంగా నరికి చంపి.. రాజ్‌కుమార్ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపాడు. గత 3 రోజులుగా రాజ్‌కుమార్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టగా.. తాజాగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలం పంజర్ల గ్రామ శివారులో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.



# రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు: పోలీస్ కమిషనర్

**ఖమ్మం, జులై 13 (పీపుల్స్ డైరీ) :** రోడ్లపై కేజ్ వీల్స్ (కేజ్ వీల్స్) అమర్చిన ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి గ్రామాల వరకు మెరుగైన రహదారులను నిర్మిస్తోందని, కాబట్టి వాటిని సురక్షితంగా ఉంచడం, రోడ్డు దెబ్బతినకుండా చూసుకోవడం అందరి బాధ్యతని అన్నారు.



వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చడం సాధారణమే అయినప్పటికీ, పొలాల వద్ద పనులు ముగిసిన తర్వాత కేజ్ వీల్స్ తొలగించిసాధారణ టైర్లు వేసుకోవాలి. లేదా రోడ్లకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయాలు వాడాలన్నారు. వ్యవసాయ పనులకు ఉపయగించే కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామ శివారులో కాకర్లపల్లి నుండి రుద్రాక్షపల్లి మధ్య గల ఆర్‌డబి రోడ్డులో రోడ్లపై కేజ్ విల్స్‌తో ట్రాక్టర్లు నడుపుతున్నారని, వాటితోనే రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, సంబంధిత ఆర్‌డబి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్లకు, యజమానులైన సారా కృష్ణ, పమ్మి కృష్ణయ్య, గుత్తి ముత్యాలరావు, బోసి కొర్రాజులు పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించినా లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ట్రాక్టర్ డ్రైవర్లకు, యజమానులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

# వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

- అక్రమాలపై విచారణ జరిపి క్లబ్‌ను ప్రక్షాళన చేయాలి
- హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు డబ్ల్యుజేఐ నాయకుల వినతి

**హన్మకొండ, జులై 13 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్‌కు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని, క్లబ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు డబ్ల్యుజేఐ నాయకులు ఒక మెమోరాండం అందజేశారు.



నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ నిర్వహణ కొనసాగుతోందని, సత్వరమే ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు నిర్వహించాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. ప్రస్తుత కమిటీ ఎన్నికై మూడున్నరేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశం నిర్వహించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బైలాను అతిక్రమించి, ప్రెస్ క్లబ్ మెంబర్షిప్ ఇవ్వడంలో కూడా తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా ప్రెస్ క్లబ్ సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రెస్ క్లబ్‌లో జరిగిన లావాదేవీలపై ప్రభుత్వం ద్వారా సమగ్ర విచారణ జరిపించి, క్లబ్‌ను ప్రక్షాళన చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుజేఐ స్టేట్ సెక్రటరీ నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు (ఎన్.ఎస్.రావు), జిల్లా నాయకులు సిరికొండ భాస్కర్, నంబూద్రిపాద్, గుంటి విద్యాసాగర్, ఎండీ షంసుద్దీన్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు పర్యావరణ పరిరక్షణ ముద్దు

**గణపురం, జులై 13 (పీపుల్స్ డైరీ) :** ప్లాస్టిక్ వద్దు పర్యావరణ పరిరక్షణ ముద్దు అనే నినాదంతో సోమవారం ఉపాధ్యాయ బృందం స్టీల్ ప్లేట్లతో కొత్త ఒరవడికి నాంది పలికారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జరుగుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా తమ వెంట తెచ్చుకున్న స్టీల్ ప్లేట్లతో భోజనం చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దనే సందేశాన్ని ఆచరణలో చూపించారు. ఇలాంటి చిన్న చిన్న మార్పులతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వారు తెలిపారు.



# కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలి

- పిల్లల భవిష్యత్తుకు కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- జాతీయ నూలుపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్





కేసముద్రం జూలై 13 (పీపుల్స్ డైరి ) జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ గురుకుల బాలికల ట్రైబల్ హాస్టల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆల్బెండజోల్ మాత్రలను వేసి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల 132641 పిల్లలకు... 1437 అంగన్వాడి కేంద్రాల్లో, 13 జూనియర్ కళాశాలలో, 1006 ప్రైవేట్, ప్రభుత్వ హై స్కూల్, ప్రైమరీ స్కూళ్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంలు, ఆశాలతో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించిన కలెక్టర్ విద్య భోధన గురించి , కళాశాలలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్య జీవితంలో చాలా ముఖ్యమైనది. చదువుపై ఆసక్తి, జీవితంలో లక్ష్యం లేకుండా చదివితే ఉపయోగం ఉండదు, మీరు భవిష్యత్ లో ఏం అవ్వాలి అనుకుంటున్నారో, ఆ మార్గం గురించి పూర్తిగా తెలుసుకొని అడుగులు ఆ దిశగా వేయాలని ఆకాంక్షించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని సూచించారు. నేను ప్రతీ నెల ఇలానే మీ విద్యాసంస్థను సందర్శిస్తాను అని తెలియజేసి, ప్రతీ ఒక విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలాషించి, ఇంటర్మీడియట్ డిగ్రీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి ఆశయాలను లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం కిచెన్ షెడ్ ను పరిశీలించి మెనో ప్రకారం ఈరోజు చేసిన వంటలను పరిశీలించారు, కచ్చితంగా పక్క డైట్ మెనో ను పాటించాలని పిల్లలకు అందించే సౌకర్యాలలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అదనపు కలెక్టర్ పురుషోత్తం, ఎంపీడీవో క్రాంతి, ప్రిన్సిపాల్ సుజాత, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్, డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివ కుమార్, రాజకుమార్, స్వామి పూరషోత్తం పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో హరితోదయ కార్యక్రమం



**హనుమకొండ, జూలై 13 (పీపుల్స్‌డైరీ) :** హనుమకొండలోని నక్కలగుట్ట లో గల శ్రీ చైతన్య పాఠశాల-4 లో సోమవారం హరితోదయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు రకరకాల మొక్కలు నాటారు. ముందుగా విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రత మరియు మిషన్ హరితోదయ అంశాలపై వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన హరితోదయ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీమ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని నాటిన తర్వాత అవి మహావృక్షాలు అయ్యేంతవరకు కాపాడాలని విద్యార్థులకు సూచించారు. వృక్షో రక్షతి రక్షితః అన్న మాదిరిగా మనం చెట్లను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి. కావున ప్రతి ఒక్కరు బాధ్యతగా చెట్లను సంరక్షించాలని ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లశీపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఆర్ఐ మనోహర్, కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీమ పాఠశాల ఇన్చార్జి నాగార్జున్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్‌బెల్స్....

(మొదటి పేజీ తరువాయి)

లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కడెం, జూరాల, నాగార్జునసాగర్, నిజాంసాగర్, సింగూర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి, వైరా, ఉదయసముద్రం, ధర్మసాగర్ వంటి జలాశయాల్లోనూ నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జలాశయాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వలతో మంజీరా, సింగూర్, గోదావరి వ్యవస్థల నుంచి సెప్టెంబర్ చివరి వరకు మాత్రమే తాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అవసరాల కోసం సింగూర్‌లో కనీసం 16 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు సూచనలు వెళ్లాయి.

ఇదిలా ఉండగా భూగర్భ జలాల పరిస్థితి కూడా దిగజారుతోంది. జూన్ నాటికి రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్ల లోతుకు పడిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను మరింత లోతుగా తవ్వడం, అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతోంది. అయితే భారీ వర్షాలు త్వరలో కురవకపోతే.. కృష్ణా-గోదావరి జలాశయాల్లో నిల్వలు పెరగకపోతే తెలంగాణలో రానున్న నెలల్లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రయాణీకుల చేతివాటం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమస్యను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు అత్యధికంగా చోరీ చేసిన వస్తువుల్లో ఫేస్ టవల్ మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో 46.54 లక్షల ఫేస్ టవల్స్ మాయమయ్యాయి.

వాటి తర్వాత 41.13 లక్షల బెడ్‌షీట్లు, 23.59 లక్షల పిల్లో కవర్లు, 12.95 లక్షల దుప్పట్లు చోరీకి గురయ్యాయి. మరోవైపు బ్యాగులో సులభంగా పెట్టుకోలేని కారణంగా దిండ్లు అత్యల్పంగా చోరీకి గురయ్యాయి. రైల్వే డివిజన్ల వారీగా చూస్తే బికనెర్ డివిజన్‌లో అత్యధికంగా 25.76 లక్షల వస్తువులు చోరీకి గురయ్యాయి. తర్వాత రాంచీ (9.31 లక్షలు), ఢిల్లీ (8.21 లక్షలు), ముంబై (8.17 లక్షలు), జోధ్‌పూర్ (8.09 లక్షలు), అహ్మదాబాద్ (6.94 లక్షలు) డివిజన్‌లు ఉన్నాయి. పంపిణీ బాధ్యత నిర్వహించే ఏజెన్సీలే ఈ వస్తువుల లెక్కలు చూసుకోవాల్సి ఉంటుందని, కొరత ఏర్పడితే ఆర్థిక భారం కూడా వారిపైనే పడుతుందని రైల్వే ప్రతినిధి తెలిపారు.

# ఫలించిన 15ఏండ్ల నిరీక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఉష్ణోగ్రత కలిగిన ఇంక్యుబేటర్లలో ఉంచి పర్యవేక్షించారు. జూన్ 29, 30 తేదీల మధ్య కాలంలో ఈ గుడ్ల నుంచి మూడు బుజ్జి నాగుపాము పిల్లలు విజయవంతంగా బయటకు వచ్చాయి. ఈ పరిణామం జూ సిబ్బందిలోనే కాకుండా వన్యప్రాణి ప్రేమికులలో తీవ్ర సంతోషాన్ని నింపింది. శాస్త్రీయ పద్ధతిలో జంతువులను ఎలా రక్షించవచ్చో చెప్పడానికి ఈ విజయమే నిదర్శనమని జూ డైరెక్టర్ పేర్కొన్నారు.

**ప్రత్యేక రక్షణ వలయంలో బుజ్జి పాము పిల్లలు..**

గతంలో 2010-11 ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి 11 ఇండియన్ కోబ్రా పిల్లలు జన్మించాయి. అయితే ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లూ జూలో ఈ జాతి పాముల పునరుత్పత్తి విజయవంతం కాలేదు. సుమారు 15 ఏళ్ల సుదీర్ఘ విఫలయత్నాలకు, నిరీక్షణకు తెరదించుతూ.. జూ వెటర్నరీ నిపుణుల బృందం కృత్రిమంగా పొదిగే పద్ధతి ద్వారా మూడు కోబ్రా గుడ్లను విజయవంతంగా పొదిగించి సరికొత్త రికార్డు సృష్టించింది. అయితే గుడ్ల నుంచి బయటకు వచ్చిన ఈ మూడు ఇండియన్ కోబ్రా పిల్లలు ప్రస్తుతం అత్యంత ఆరోగ్యంగా.. చురుగ్గా ఉన్నాయని జూ అధికారులు స్పష్టం చేశారు.

**వన్యప్రాణి సంరక్షణలో కీలక మైలురాయి..**

భారతదేశంలో అంతరించిపోతున్న లేదా ప్రమాదంలో పడుతున్న సరీసృపాల రక్షణకు, జూలలో ఇలాంటి శాస్త్రీయ పునరుత్పత్తి పద్ధతులు ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. సుమారు 15 ఏళ్ల తర్వాత ఢిల్లీ జూలో కోబ్రాల కృత్రిమ జననం జరగడం అనేది రాబోయే రోజుల్లో మిగిలిన అరుదైన పాముల జాతుల సంరక్షణకు సరికొత్త మార్గాన్ని చూపినట్లయింది.

# మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



మొగుళ్ళపల్లి జూలై 13 ( పీపుల్స్ డైరీ ) : మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు సమాజంలో సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేశారని కొనియాడారు. జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా నేడు ఆయన పేరుతో విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆయన ఆనాడే నిరూపించారని పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం వల్లనే నేడు ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారని అన్నారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే మహిళా విద్యకు మార్గదర్శకురాలని ఎమ్మెల్యే కొనియాడారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా వారి ఆశయాలను, సిద్ధాంతాలను భావితరాలకు అందిస్తూ వారి చూపిన మార్గంలో నడవడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ గడువు నెల రోజులు పొడిగించాలి

**చిట్యాల, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్ ఓటరు సవరణ గడువు నెల రోజులుపెంచాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తాహసిల్దార్ అనిల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సర్ ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేయడానికి ఇచ్చిన గడువు సరిపోదని ఆ గడువును నెలరోజులు పెంచాలని ఎన్నికల అధికారులను ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద గ్రామపంచాయతీలలో ఓటర్లు ఎక్కువగా ఉన్నందున అధికారులు నియమించిన బిఎల్వోలు సరిపోరని అందులో చిట్యాల గ్రామపంచాయతీ 5 వేల ఓటర్లు ఉన్నందున నలుగురు బిఎల్వోలను నియమించడం సరి అయినది కాదన్నారు. రాష్ట్ర జిల్లా మండల ఎన్నికల అధికారులు పెద్ద గ్రామ పంచాయతీలు ఉన్న చోట అదనంగా బి ఎల్ ఓ లను పెంచాలన్నారు. ఇతర గ్రామాల్లో బిఎల్ఓ లకు 500 ఓటర్లు ఉంటే చిట్యాల గ్రామపంచాయతీలో ఒక్క బిఎల్ఓ కు దాదాపు 1200 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు ఇంటి కి రెండు మూడు సార్లు తిరుగుతున్నారని చిట్యాలలో ఉన్న బిఎల్ఓ లు నలుగురు మహిళలు ఇబ్బందులు పడుతున్నందున మరో నలుగురు బిఎల్ఓ లను పెంచాలని సంబంధించిన అధికారులను కోరారు. ఓటర్లు తప్పిపోయినచో చాలా ఇబ్బంది పడతారని తప్పిపోకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం టేకుమట్ల మండల కన్వీనర్ మారేపల్లి కొమురయ్య మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు నాయకులు గురుకుంట్ల కిరణ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్ డైరీ
వరంగల్
మంగళవారం, 14 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 127


# పాండవుల గుట్టలో వర్షం కోసం మొక్కులు-వరుణుడి కటాక్షం కోసం వరద పాశం

## బారీగా మొక్కలు చెల్లించిన మహిళలు ...



**రేగొండ జూలై 13 పీపుల్స్ డైరీ :** వేసవిలోనే ఊరించిన వర్షాలు జాడ లేకుండాపోయాయి. తొలకరి మొదలైన చినుకు తడి కరువైంది. దీంతో వరుణుడి కరుణ కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమై రెండు నెలలు కావస్తున్న ఒక్క వాన చుక్క కూడా సరిగా కురవకపోడంతో.. ఆకాశంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వరుణుడి కటాక్షం కోసం రైతులు పాండవుల గుట్టలో మొక్కులు మొక్కుతున్నారు. వానాకాలంలో ఈసారి నైరుతి రుతుపవనాలు నిర్ణీత సమయం కంటే ముందుగానే కేరళను తాకాయి. రోహిణి కార్తెలోనే చిరుజల్లులతో కూడిన వర్షాలు కురిశాయి. జూన్ రెండో వారంలోగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ కూడా ప్రకటించింది. అయితే వర్షాలు విస్తారంగా కురవకపోవడంతో పంటల సాగుపై రైతులు సందిగ్ధంలో పడ్డారు. భూపాలపల్లి జిల్లాలో అక్కడక్కడ ఓ మోస్తారు వర్షాలు కురిసి ఆశలు చిగురింపజేసినా, పూర్తిస్థాయిలో కురవక పోవడంతో సందిగ్ధం నెలకొంది. తొలుత కురిసిన వర్షాలకు కొందరు రైతులు విత్తనాలు విత్తారు. మృగశిర కార్తె ముగిసిన వర్షాలు లేక విత్తిన విత్తనాలు మొలకెత్తడం లేదని, మొలకెత్తిన మొలకలు ఎండలకు వాడిపోతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్టలో వర్షాలు కురవాలని రూపిరెడ్డి పల్లి గ్రామ మహిళలు వరుణ దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై కుంతి గుహ వద్ద ప్రత్యేక పూజలు చేసి వరద పాశం వండి నెల పై పోసి దానిని నాలుక తో నాకుతారు. ఇలా చేస్తే వరుణ దేవుడు కరుణించి పుష్కలంగా వర్షాలు కురుస్తాయని ప్రగడ నమ్మకం. అలాగే మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ వరుణ దేవుణ్ణి వేడుకున్నారు. గ్రామ ప్రజలంతా ప్రతి ఇంటి నుండి కొన్ని బియ్యం తీసుకొని ప్రసాదాన్ని వండారు. కొండపై ఉన్న శివాలయంలో వరద పాశం వండి, వరుణ దేవునికి నైవేద్యం సమర్పించి, ప్రసాదాన్ని నాలాబండపై పోసి మహిళలు భక్తితో ఆరగించారు. ఇలా చేయడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం. ఈ ఆచారం తరతరాలుగా వస్తోందని, వరద పాశంతో వరుణుడు శాంతించి వర్షాలు కురుస్తాయని మహిళలు చెబుతు న్నారు. వర్షం కోసం మహిళలు పునకాలతో కుంతి గుహ దద్ధరిల్లి పోయింది అలాగే మేకల బండ పై సొరంగంలో వర్షపు నీటితో స్నానాలు చేసి వర్షం కురవాలని అర్ధనాథలు చేసారు. ఇకనైనా వరుణ దేవుడు కరుణించి పుష్కలంగా వర్షాలు కురుస్తాయని ఆశాభావం తో తమ గ్రామానికి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదుతన పల్లి కుమార స్వామి, రూపిరెడ్డి చంద్ర రెడ్డి, సర్వ్ రవి ,సర్వ్ కుమార స్వామి, పంచగిరి అగయ్య, తోట సమ్మయ్య, మహేందర్, మహిళలు పాల్గొన్నారు..

# కుట్టుపని ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..




**భూపాలపల్లి జూలై 13 పీపుల్స్ డైరీ :** జిల్లాలోని సంక్షేమ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందజేయడానికి కుట్టుపని ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో యూనిఫాంల తయారీ, ప్రగతిపై ఎస్సీ, బీసీ, గిరిజన మరియు మైనారిటీ సంక్షేమ అధికారులు, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కుట్టుపని పురోగతిని ప్రతిరోజు సమీక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాంల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వివిధ సంక్షేమ శాఖల అధికారులు మరియు స్వయం సహాయక, మెప్మా సంఘాలు సమన్వయంతో ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డిఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమీషనర్ ఉదయ్ కుమార్, బిసి సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, మైనారిటీ సంక్షేమ అధికారి నాగ సాగర్, మైనారిటీ సంక్షేమ అధికారి కుమార స్వామి, సంక్షేమ మరియు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు అక్రమణలను అడ్డుకోండి - జోనల్ కమిషనర్‌కు సీపీఐ వినతిపత్రం



**కుత్బుల్లాపూర్, జూలై 13 :** కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని చింతల్ సర్కిల్, మహాదేవపురం, గాజులరామారం సర్కిళ్లలో రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో ప్రజలు తీవ్ర రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రోడ్ల ఆక్రమణకు గురికాకుండా వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా జగద్గిరిగుట్ట పరిధిలోని పైప్లైన్ రోడ్, సీపీఐ ఆఫీస్ లైన్, బీరప్ప నగర్ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రోడ్లపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మున్సిపల్ సిబ్బంది తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉండటంతో, ఇప్పుడు అవి శాశ్వత నిర్మాణాలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే కఠిన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. స్థానిక సిబ్బందికి ఈ విషయాలు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, దీంతో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా విధులు నిర్వహిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు రాదని, ప్రజలకు కూడా ఇబ్బందులు ఉండవని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాగి నారాయణరెడ్డి నగర్‌లో బాక్స్ నాళా నిర్మాణ పనుల సందర్భంగా రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, వెంటనే రహదారిని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, కొండయ్య, శ్రీనివాస్, జంబూ, మహేష్, యాగంటి తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- ఉప్పల్ గౌడ్స్ ,ముదిరాజ్ మరియు కుమ్మరి గ్రేవి యార్డ్ కు మహర్దశ
- మాజీ కార్పొరేటర్ బన్నాల
- ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి సహకారంతో 1 కోటి 80 లక్షల రూపాయల నిధులు మంజూరు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్), జూలై13 :** బీరప్ప గడ్డ డివిజన్ లో గౌడ్స ముదిరాజ్ కుమ్మరి సంఘం గ్రేవ్ యార్డ్ కు 1 కోటి 80 లక్షల నిధులు సాంక్షన్ చేయించిన ఎమ్మెల్యే కి ఉప్పల్ గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కు రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కు శాలువాతో సత్కరించి వారి కి కృతజ్ఞతలు తెలిపారు అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి తను కట్టుబడి ఉన్నానని తన ఎన్నికల లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నానని బీరప్ప గడ్డ డివిజన్ లోని గౌడ్స ముదిరాజ్ కుమ్మరి కులస్తుల కు 1 కోటి 80 లక్షల రూపాయల నిధులు సాంక్షన్ చేయించానని, మొదటి దఫా లో 45 లక్షలతో గ్రేవియార్డ్ నిర్మాణ పనులు మొదలు పెడతారని దశలవారీగా మొత్తం 1 కోటి 80 లక్షల రూపాయలతో మోడల్ గ్రేవీ కింద దాన్ని తీర్చు దిద్దుతామని అన్నారు.

టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ముగ్గురు కులస్తుల నాయకుల అందరితో కలిసి ఇనాగరేషన్ తో పనులు మొదలు పెట్టుకుందామని అన్నారు. ఎమ్మెల్యే కార్పొరేటర్ కి సత్కరించిన వారిలో గౌడ సంఘం సభ్యులు బజారు కృష్ణ గౌడ్, బింగి బిక్షపతి గౌడ్, బింగి శ్రీరాములు గౌడ్ ,బజార్ మురళీకృష్ణ గౌడ్, పొటగని బాలరాజు గౌడ్, నేర్దం భాస్కర్ గౌడ్, బూత్కూర్ సాయి కుమార్ గౌడ్, మించ కృష్ణ గౌడ్, బందారం రాముగౌడ్, బింగి భరత్ గౌడ్, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్ ,బద్దం జ్ఞానేశ్వర్ గౌడ్, బందారం లక్ష్మణ్ గౌడ్, బూత్కూరి నవీన్ గౌడ్ భూత్కూరి గణేష్ గౌడ్ వెంకటేష్ గౌడ్ గౌడ సంఘం ప్రతిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం

## రూ.80 లక్షల నిధులను మంజూరు చేయించిన పరమేశ్వర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్), జూలై13:** ఉప్పల్ సర్కిల్ బీరప్పగడ్డ లోని రాఘవేంద్ర కాలనీలో గణేష్ దేవాలయం సమీపంలో రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణ పనులకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి రూ.80 లక్షల నిధులను మంజూరు చేయించారు. సోమవారం రాఘవేంద్రకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరు పత్రాలను అందచేశారు. అభివృద్ధి పనులతో సమస్యల పరిష్కారం: పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నిధులతో రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కాలువ ఒడ్డు బలపడటంతో పాటు నేల కోతను నివారించ వచ్చున్నారు. భారీ వర్షాల సమయంలో సమీప రహదారులు,నివాస ప్రాంతాలకు రక్షణ కల్పించబడుతుందన్నారు. అలాగే, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం ద్వారా పాదచారులు, వాహనాల రాకపోకలు సురక్షితంగా సౌకర్యవంతంగా సాగేందుకు అవకాశం కలుగుతుందని అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడంతో పాటు ప్రాంత అభివృద్ధికి, ప్రజల భద్రతకు సౌకర్యాలకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆగం రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి రాజేష్ ముదిరాజ్,మహేష్ ముదిరాజ్ కాలనీ వాసులు గంగాధర్ గౌడ్ అజయ్ కుమార్ గుప్తాసుధాకర్ రెడ్డి రాజేశ్వర్ రావు,మురళీ కృష్ణ కిరణ్ భట్కర్ జంగయ్య మల్లేష్ యాదవ్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు

# నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



**సింగరేణి (కారేపల్లి) జులై 13 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, ఉప సర్పంచ్ ఉపేందర్ చేతుల మీదుగా పంపిణీ చేసి వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న నులిపురుగుల నివారణ మాత్రలను రెండు విడతల్లో తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి బాలబాలికకు ఈ మాత్రలు అందేలా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల కడుపులోని నులిపురుగులు నశించి, పిల్లలు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు రక్తహీనత సమస్య కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి చిన్నారికి ఈ మాత్రలు అందే వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని హెచ్ఎంని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ టీచర్, అంగన్వాడీ వర్కర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ సాంస్కృతిక సారథి ఎర్రన్న బదిలీ

## ఘనంగా సన్మానించిన అధికారులు



**భూపాలపల్లి జూలై 13 పీపుల్స్ డైరీ..** తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారునిగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో కళాజాత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన మైసా శంకరయ్య (ఎర్రన్న)ను బదిలీ చేస్తూ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సభ్య కార్యదర్శి ఏనుగు నరసింహ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు విధుల నుండి విడుదల అవుతున్న సందర్భంగా సోమవారం డిపిఆర్వో కార్యాలయంలో శంకరయ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిపిఆర్ఓ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ శంకరయ్య టీము లీడర్ గా తన విధుల నిర్వహణలో అందర్నీ సమన్వయం చేస్తూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తన సేవలకు గుర్తింపుగా శంకరయ్యను సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రంజిత్, శ్రీనివాస్, కుమార్, ప్రవీణ్, రవి, రజిత, శ్యామల, శిరీష, స్వప్న, స్వాతి, నాగమణి పాల్గొని శంకరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

# రేషన్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి జూలై 13 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నూతన రేషన్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై రేషన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పి లబ్ధిదారులను మోసం చేసిందని, నాణ్యతలేని దొడ్డు బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందేలా పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆహార భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీవో గారు, స్థానిక సర్పంచ్, రేషన్ షాప్ నిర్వాహకులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే



**జూలై13 :** రామంతపూర్ పెద్దచెరువు భాగంలో గత 40 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదప్రజానీకాన్ని వెంటబెట్టుకొని ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ సోమశేఖర్ గౌడ్ రఘుపతి గౌడ్ తదితరులతో కలసి సోమవారం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ని వారి కార్యాలయంలో కలిసి గుడిసె వాసులకు డబల్ బెడ్రూంలో ఇల్లు కేటాయింపు పై చర్చించడం జరిగింది. అందుకు వారు స్పందించి త్వరలోనే ఈ పేద కుటుంబాలకి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని హౌసింగ్ బోర్డ్ అధికారులను ఆదేశించడం జరిగింది.

పీపుల్స్ డైరీ
వరంగల్
మంగళవారం, 14 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 127


# భక్తులతో కిటకిటలాడిన వెలుగు గుట్ట ఆలయం

**చతుర్దశి,ఆరుద్ర నక్షత్రము,మాస శివరాత్రి, శ్రీ మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్),జులై13:** జులై 13 అత్యంత శక్తివంతమైన మహాశైవ యోగం! కృష్ణ చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం,మాస శివరాత్రి కలయిక సోమవారం తో శతాబ్దానికి ఒకసారి మాత్రమే సంభవిస్తుంది. 2050 సంవత్సరం వరకు ఈ లాంటి మహా శివ యోగం రాదు ఈ పవిత్రమైన రోజున శివాలయం లో పూజలు, అభిషేకాలు చేయడం అత్యంత శ్రేయస్కరం. ఈ విశేషమైన రోజును భక్తులు వేలాది మంది వెలుగుగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం లో పంచామృత అభిషేకాలు అర్చనల తో సద్వినియోగం చేసుకున్నారు . సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ గొరిగే పెద్ద మల్లేష్ కురుమ ఈఓ పెద్దిశ్రీకాంత్ ఫౌండర్ ట్రస్టీ హైకోర్టు న్యాయవాది గొరిగే మల్లేష్ కురుమ,దేవాలయ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్ మురళి,రాజు,బండారి మంజుల తదితరులు పాల్గొన్నారు


# టీపీసీసీ సాంస్కృతిక సేన సిద్దిపేట జిల్లా కమిటీ ఏర్పాటు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 13 :** సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కళాప్రసాద్, కార్యదర్శి బండకాడి గణేష్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కళాప్రసాద్ (పుల్లూరు), ప్రధాన కార్యదర్శిగా బండకాడి గణేష్ (వెంకట్రావుపేట), ఉపాధ్యక్షులు సోము నరేష్ (ప్రజ్ఞాపూర్), కార్యదర్శి కళ్యాం లక్ష్మణ్ యాదగిరి (చేర్యాపూర్), కోశాధికారి బీమరీ సీరియల్ (జగదేవపూర్), ప్రచార కార్యదర్శి డప్పు ప్రశాంత్ (ఆకారం), మహిళా కార్యదర్శి పెద్ద మ్యాతరి రజిత (పెద్దచీకోడ్), గంధమల్ల శ్యామల (గజ్వేల్), కార్యవర్గ సభ్యులు బెజ్జంకి తిరుపతి, వినోద్ కుమార్ అస్కస్వామి, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామందరం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో ముందుంటామని, తమ ఆట పాటతో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తామని తెలియజేశారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు చక్రాలరవికి, డీసీసీ అధ్యక్షులు తూముకుంట ఆంక్షారెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


# వ్యాయామశాల నిర్వాహకులకు నిధుల మంజూరు

**రామంతాపూర్ "భజరంగ్ వ్యాయామశాల "అభివృద్ధికి రూ.90 లక్షల నిధులు**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్), జూలై13 :** రామంతాపూర్ లోని పురాతన భజరంగ్ వ్యాయామశాలకు మంచి రోజులు వచ్చాయి. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఇచ్చిన మాటనిలుపుకున్నారు.రామంతాపూర్ ప్రాంతంలోని భజరంగ్ వ్యాయామశాల యువకులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఏకంగా రూ.90 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులలో రూ.48 లక్షలతో వ్యాయామశాలలో జిమ్ పరికరాల కొనుగోలు, మరో రూ.42 లక్షలతో అదనపు గదుల నిర్మాణం, బోర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. భజరంగ్ వ్యాయామశాల నిర్వాహకులకు సోమవారం పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరు పత్రాలను అందచేశారు.కార్యక్రమంలో రవీందర్ రెడ్డి,బుర్రా నరసింహ దయాకర్ రెడ్డి,జనార్ధన్,జి. రమేష్ ప్రసాద్, ఆనంద్,మధు లఖన్,ఎస్ రమేష్,రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ రఫిక్ వళ్ళపు శ్రీకాంత్ యాదవ్,నామ్ రాజీ రెడ్డి,జలీల్ పాషా,సచిన్,సతీష్ గౌడ్,బుల్లెట్ ఆశోక్,చింటు పాల్గొన్నారు

# నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 13:** సోమవారం 128వ డివిజన్ చింతల్ పరిధిలోని ఎన్ఎల్బీ నగర్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం మరియు పోచమ్మ దేవస్థానం నూతన కమిటీ సభ్యులు పెట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో కమిటీ చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ ఎం. బసవరాజ్, సలహాదారులు జేమ్స్, ఆకుల ప్రభాకర్ గుప్తా, అధ్యక్షుడు వేముల నాగరాజు గుప్తా, వైస్ ప్రెసిడెంట్ గుంజరి నరేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జి. కృష్ణ, కోశాధికారి వి. కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరుద్ర నక్షత్రంతో బీరంగూడ గుట్టకు పోటెత్తిన భక్తులు

**అన్నదానానికి రూ.1 లక్ష విరాళం.. విశేష అభిషేకాలు**

**పటాన్‌చెరు, జూలై 13:** సోమవారం రోజున ఆరుద్ర నక్షత్రం రావడంతో బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ పవిత్ర సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రహ్లాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ నిరంతరంగా అభిషేకాలు నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, సోమవారం రోజున ఆరుద్ర నక్షత్రం కలిసిరావడం అత్యంత విశిష్టమైన సందర్భంగా భావించి



భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారని తెలిపారు. పరమశివుడికి అభిషేకం చేస్తే విశేష పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని చెప్పారు. ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ఈ సందర్భంగా వినోద్ కుమార్ కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.1 లక్ష విరాళం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. రెండో శ్రీశైలంగా పేరుగాంచిన ఈ దేవాలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ధర్మకర్తల మండలి సభ్యులం దరూ ఏర్పాట్లు చేశారని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సతీమణి పట్నం సునీత మహేందర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆలయ ఈవో దేవనాథం, దేవాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరు లు పాల్గొన్నారు.

# రేజింతల్‌కు స్మశాన వాటిక స్థలం కేటాయించాలి

- **గ్రామపంచాయతీ జనరల్ బాడీలో తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్**

**సదాశివపేట, జులై 13 :** సదాశివపేట మండలంలోని రేజింతల్ గ్రామ ప్రజలందరికీ స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని, ఈ అంశాన్ని గ్రామపంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ డిమాండ్‌తో సోమవారం రేజింతల్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ ప్రజలతో కలిసి నిరసన చేపట్టి, గ్రామ సర్పంచ్ ఆశిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, సదాశివపేటకు సమీపంలో ఉన్న రేజింతల్ గ్రామంలో ఇప్పటివరకు స్మశాన వాటికకు స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియ లు నిర్వహించేందుకు సరైన స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



గ్రామంలోని అధిక శాతం కుటుంబాలు కూలీ పనులపై ఆధా రపడి జీవిస్తున్నప్పటికీ, ఎన్నో ప్రభు త్వాలు మారినా స్మశాన వాటిక సమస్య మాత్రం పరిష్కారం కాలేదని విమర్శించారు.గ్రామ శివారులో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని, గతంలో ఇతర అవసరాలకు ప్రభుత్వ భూములు కేటాయించినప్పటికీ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక కోసం మాత్రం స్థలం కేటాయి ంచకపోవడం అన్యాయ మన్నారు. సర్వే నంబర్ 149లో ఉన్న ప్రభుత్వ అసైన్మెంట్ భూమిలో గ్రామ ప్రజలందరికీ స్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరారు. స్మశాన వాటిక స్థలం కేటాయించే వరకు గ్రామ ప్రజలతో కలిసి దశలవారీగా ఉద్యమాలు చేపడ తామని, అవసరమైతే పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోపాల్, భాస్కర్, వీరస్వామి, సంయొద్దీన్, మోహన్, రమేష్, బుచ్చయ్య, మానయ్య, ఆనందం, శివయ్య, చంద్రయ్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆరోగ్యం బలమిస్తుంది..విద్య వెలుగునిస్తుంది

- **వైద్య, విద్యా రంగాలకే ప్రజా ప్రభుత్వం పెద్దపీట**
- **ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు**

**ఉమ్మడి వరంగల్ జులై 13 :** మన జీవితంలో అత్యంత విలువైన రెండు సంపదలు ఆరోగ్యం మరియు విద్య అని, ఆరోగ్యం బాగుంటేనే విద్యను సమర్థవంతంగా అభ్యసించగలమని, విద్య ఉంటేనే మంచి ఆలోచనలు, మంచి విలువలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోగలమని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య, విద్య రంగానికి పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంజేపి గురుకుల పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారులు చేపట్టగా..ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పిల్లల పేగుల్లో దాగి ఉన్న నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, పిల్లల ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలను తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగుల వ్యాధిని నివారించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధు-సూదన్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దేవేందర్, మండల వైద్యాధికారిణి డాక్టర్ గొడిశాల నవత గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగరాణి, మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు, ఎంజేపి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఎంపీడీవో గొడిశాల సురేందర్ గౌడ్, తహసిల్దార్ సునీతా రెడ్డి, ఎంఈఓ లింగాల కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నరసింహారావు, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోలినేని లింగారావు, తక్కల్లపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె రాజేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి, ఏఎన్ఎం శ్రీలత, జిల్లా మరియు మండల వైద్య సిబ్బంది, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**మొగుళ్ళపల్లి మండల వైద్యాధికారిణి డాక్టర్ గొడిశాల నవత గౌడ్**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధు-సూదన్ ఆదేశాల మేరకు మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు మరియు గురుకుల కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థుల కోసం చేపట్టిన



అల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని మండల వైద్యాధికారిణి డాక్టర్ గొడిశాల నవత గౌడ్ అన్నారు.

**26 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల అందజేత**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని 26 మంది లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా, రైతు బీమా, రైతు బోనస్, మహాలక్ష్మి పథకం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. అలాగే విద్య, వైద్యం మీద ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎం ఆర్ ఐ, సిటీ స్కాన్ వంటి అధునాతన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, వంద పడకల ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# ప్రజావాణిలో వినతులను స్వీకరించిన ఎంఎంసీ కమిషనర్

- **ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం,**
- **ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి ఆదేశాలు**
- **ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన సేవలందించడమే లక్ష్యం**
- **ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి -- కమిషనర్**

**మేడ్చల్ జిల్లా ,(ఉప్పల్),జూలై13 :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో కమిషనర్ టి.





వినయ్ కృష్ణా రెడ్డి, ఐఏఎస్ ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి వారి సమస్యలను ఓర్పుగా ఆలకించారు. అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, సత్వర పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించాలని ఆదేశించారు.

**శాఖల వారీగా అందిన దరఖాస్తులు:**

టౌన్ ప్లానింగ్ -- 17 ఇంజినీరింగ్ -- 10 రెవెన్యూ -- 2 మొత్తం దరఖాస్తులు: 29 ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమర్థవంతమైన వేదిక అని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరి ంచేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన, పౌర కేంద్రిత పాలన అందించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నిరంతరం కట్టుబడి ఉందని కమిషనర్ స్పష్టం చేశారు.

# దుండిగల్ డివిజన్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్థంభాల తొలగింపు

### కొత్త స్థంభాల ఏర్పాటుకు ఏడిఈ కి వినతిపత్రం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 13 :** దుండిగల్ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం, నాగులూరు గ్రామం, దుండిగల్ తండా-01, దుండిగల్ తండా-02, గగిల్లాపూర్ గ్రామం, చర్చ్ గగిల్లాపూర్ గ్రామం, 214 కాలనీ, శంభిపూర్ గ్రామం, మహేశ్వరం గ్రామం, కేవీఆర్ కాలనీ ప్రాంతాల్లో దెబ్బతిన్న, వంగిన మరియు రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించి, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ గారు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ /ట్రాన్సకో జీడిమెట్ల కార్యాలయంలో ఏడిఈ కి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వీరబత్తిని నరేందర్ గౌడ్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్,దొంతి మహేష్ ముదిరాజ్, దత్తు రాజ్ యాదవ్ మాట్లాడుతూ, పై ప్రాంతాల్లో అనేక విద్యుత్ స్థంభాలు దెబ్బతిని, వంగి ఉండటంతో పాటు కొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా ఉండడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అలాగే గాలివానలు, భారీ వర్షాలు వంటి సహజ కారణాలతో దెబ్బతిన్న స్థంభాలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల సం బంధిత అధికారులు ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తక్షణమే పరిశీలించి, వం గిన మరియు దెబ్బతిన్న స్థంభాలను తొలగించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న స్థంభాలను తొలగించి, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సురక్షితమైన ప్రదేశాల్లో పునఃస్థాపన చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత నిస్తూ ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం ఏడిఈ ని కోరింది.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,



**భూపాలపల్లి జూలై 13 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, వివరాలను నిరంతరం అప్డేట్ చేయాలని తెలిపారు. వ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని ఫీచర్లను సమర్ధవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం మరియు సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# 36 గంటల్లోనే మహిళ హత్య కేసు ఛేదన

### అనుమానంతో సహజీవన భాగస్వామే హత్య చేసినట్లు వెల్లడి

### నిందితుడి అరెస్ట్ -- ఏసీపీ భాసం చెట్టి మాధవి




**హుజురాబాద్, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలోని మామిళ్లవాడలో సంచలనం సృష్టించిన చింత సునీత (35) హత్య కేసును పోలీసులు కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. అనుమానంతోనే ఆమె సహజీవన భాగస్వామి మోత కిరణ్ ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. సోమవారం హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వాసం చెట్టి మాధవి కేసు వివరాలను వెల్లడించారు. సహజీవనం.. అనుమానంతో తరచూ గొడవలు ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత భర్త కుమార్ కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. అనంతరం ఆమె గత ఐదేళ్లుగా మోత కిరణ్‌తో కలిసి మామిళ్లవాడలోని గ్యాస్ గోదాం సమీపంలోని అద్దె ఇంట్లో సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో సునీత తన పొరుగున నివసించే ముత్తోజు భాగ్య అనే మహిళతో స్నేహంగా ఉండి తరచూ బయటకు వెళ్లేది. దీనిపై కిరణ్ అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి.

### మద్యం మత్తులో వాగ్వాదం.. దారుణ హత్య

ఈ నెల 10వ తేదీన ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం మరోసారి వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్, సునీత గొంతు నులిమి, చీర ముక్కతో గొంతు బిగించి, కాళ్లతో మెడపై తొక్కి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు

### బావిలో మృతదేహం.. కరీంనగర్‌కు పరార్

హత్య అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని సునీత స్నేహితురాలు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడు. అనంతరం మృతురాలి లోదుస్తులను బావి సమీపంలోని చెట్టు వద్ద పడేసి అక్కడి నుంచి కరీంనగర్‌కు పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడు హుజురాబాద్‌కు తిరిగి వచ్చినట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో కిరణ్ తన నేరాన్ని అంగీకరి ంచినట్లు పోలీసులు తెలిపారు. అతడు ఇచ్చిన సమాచారంతో హత్య జరిగిన ఇల్లు, మృతదేహాన్ని పడేసిన బావి, దుస్తులు పడేసిన ప్రాంతాలను పరిశీలించి కీలక ఆధారాలు సేకరించారు. సంఘటనా స్థలం నుంచి పగిలిన గాజులు, పూసలు, పుస్తెలు కాళ్ళ పట్టీలు ఇతర భౌతిక ఆధారాలతో పాటు బావి సమీపంలో పడేసిన మృతురాలి లోదుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీపీ మాధవి తెలిపారు.

### పోలీసు బృందానికి ఏసీపీ అభినందనలు

ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సీఐ కరుణాకర్, ఎస్సైలు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, రవీనాథ్, మహేందర్, శ్రీధర్, అనిల్‌లను ఏసీపీ వాసం చెట్టిమాధవి ప్రత్యేకముగా అభినందించారు.

# బాలవికాస ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

### పోతిరెడ్డి పల్లి లో ఉచిత వైద్య శిబిరంలో 210 మందికి వైద్య సేవలు



**వీణవంక జులై 14( పీపుల్స్ డైరీ) :** పోతిరెడ్డి పల్లి లో ఉచిత మేఘ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో సర్పంచ్ మొగిలియ్య మాట్లాడుతూ వైద్య చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో ఫిజిషియన్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని సూచించారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే వైట్ ఫుడ్స్‌ను తగ్గించి, పోషక విలువలు కలిగిన రంగురంగుల ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల యువతలో ఊబకాయం పెరుగు తోందని, శరీర బరువును నిర్దేశిత ప్రమాణాలకు అనుగు ణంగా నియంత్రించుకోవాలని తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యానికి సంబంధించిన మూఢనమ్మకాలను విడనాడాలని, యుక్తవయసు బాలికలు పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, దాదాపు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య-కొమురయ్య మాట్లాడుతూ ఈ శిబిరంలో సుమారు 210 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, రూ. 45 వేల విలువైన మందులను పంపిణీ చేసిన ఆదిత్య ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాలవికాస చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుష్మ, కరోబార్ రాపర్తి శ్రీకాంత్, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, హాస్పిటల్ సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, సుచిత్ర, సంతోషిని, పూజతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైదాపూర్ ఎంజేపీ గురుకులంలో సర్పంచ్ తనిఖీ

**సైదాపూర్ జులై 13( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండల పరిధిలోని బోర్నపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న-సంతోష్ సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ముందుగా పాఠశాల వంటశాలను సందర్శించిన సర్పంచ్.. విద్యార్థుల కోసం వినియోగిస్తున్న కూరగాయల నాణ్యతను, వంటగదిలోని సదుపాయాలను, పరిసరాల పరిశుభ్రతను నిశితంగా గమనించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం వండుతున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు, సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. అనంతరం సర్పంచ్ స్వప్న-సంతోష్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రోజూ ఇలాగే భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. ప్రజాప్రతినిధులు స్వయంగా వచ్చి తమ సమస్యలు తెలుసుకోవడమే కాకుండా, తమతో కలిసి భోజనం చేయడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



# డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆవాల నరహరి, చకినాల రామ్‌మోహన్





**కరీంనగర్ జూలై 13 పీపుల్స్ డైరీ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ రోడ్డు లోని కృషి భవన్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పదహారవ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా ఆవాల నరహరి ప్రధాన కార్యదర్శిగా చకినాల రామ్-ంమోహన్ ఉపాధ్యక్షులుగా ఏ. దామోదర్ , హుమేరా జబీన్ , టి.తిరుపతి గౌడ్ కార్యదర్శులుగా ఏ.శ్రీనివాస్ , ఆర్. శంకరయ్య, బి. రమేష్, ఎస్. చక్రధర్ ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యు. శంకర్ సభ్యులుగా యం. సత్యనారాయణ రెడ్డి, బి.శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వి రాజిరెడ్డి , రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె నారాయణ రెడ్డి, ఎం . రఘుశంకర్ రెడ్డి పూర్వ రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రమౌళి హాజరయ్యారు . ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఏ.శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా బి. శ్యామ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన అవాల నరహరి, చకినాల రామ్‌మోహన్ మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు డీటీఎఫ్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా కరీంనగర్ జిల్లాలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు అదేవిధంగా రాష్ట్ర కౌన్సిలర్‌లుగా ఎన్నుకయారు 1.నారాయణరెడ్డి 2.రఘుశంకర్ రెడ్డీ 3 .రాజిరెడ్డి 4.ఈశ్వర్ రెడ్డి 5.దేవేందర్ 6.తూముల తిరుపతి 7.కేషన్ రెడ్డి 8.సంపతి 9.రాజమౌళి 10.సముద్రలా అంజయ్య 11.జయప్రద గౌతమీ 12.సదానందం 13.రాంకిరన్ 14.అరుణ 15.నరసింహరెడ్డి 16. మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జూపాక గ్రామంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహణ



**జూపాక, జూలై 13 (పీపుల్స్ డైరీ):** జూపాక గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పిల్లలు నులిపురుగుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఎదగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాల్లపెల్లి స్వప్న, ఉప సర్పంచ్ మహేందర్ జీ, 10వ వార్డు సభ్యురాలు రవళిక, సబ్ సెంటర్ వైద్యురాలు డా. గీతా, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఏఎన్ఎం అభేద, ఆశా వర్కర్ ఉమా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మాత్రలు తీసుకోని 1--19 సంవత్సరాల పిల్లలు జూపాక పల్లె దవాఖాన (సబ్ సెంటర్)ను సంప్రదించి ఆల్బెండజోల్ మాత్రలను పొందాలని వైద్య సిబ్బంది సూచించారు.


# హుజురాబాద్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



**హుజురాబాద్, జూలై 13 (పీపుల్స్ డైరీ):** హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "ఒక చిన్న మాత్ర... పిల్లల ఆరోగ్యానికి గొప్ప రక్షణ", "నులిపురుగుల నివారణ మాత్ర ప్రతి చిన్నారి హక్కు -- ప్రతి తల్లిదండ్రుల బాధ్యత" అనే నినాదాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు పాల్గొని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ కీలకమని, ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఈ మాత్రను తీసుకోవాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ మాత్రను వేయించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో హిమబిందు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల, సీడీపీవో సుగుణ, కౌన్సిలర్లు సునీత, శ్రీలేఖ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి సంరక్షణ అందరి బాధ్యత

### టి. మల్లికార్జున్ -హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్




**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 13 :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "క్యాచ్ ద రైన్" కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పురపాలక సంఘ కమిషనర్ టి. మల్లికార్జున్ కంపోస్ట్ షెడ్ వద్ద పారిశుద్ధ్య సిబ్బందితో వర్షపు నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ ప్రాముఖ్యతను వివరించి, వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు. పట్టణ ప్రజలకు కూడా రైన్ వాటర్ హార్వెస్టింగ్ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టేలా ప్రోత్సహించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్లు శ్రీకాంత్, నవీన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లోనే కోర్టు కొనసాగించాలి

**సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి - హుస్నాబాద్ బిఆర్ఎస్ నాయకులు**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 13 :** హుస్నాబాద్ కోర్టును పట్టణం నుంచి తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి కోరారు. హుస్నాబాద్‌లో కోర్టు ఏర్పాటై 22 సంవత్సరాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం కోర్టు పరిసర ప్రాంతం అభివృద్ధి చెంది ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. కోర్టును మండలంలోని ఉమ్మాపూర్ , జిల్లెల్లగడ్డ ప్రాంతానికి తరలిస్తే కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు-ర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, కోర్టు హుస్నాబాద్ పట్టణంలోనే కొనసాగేందుకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాస శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, గుగులోతు తిరుపతి నాయక్, మాటూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



**కోహెడ జులై.13 (పీపుల్స్ డైరీ):-** బస్వాపూర్ పాఠశాలలోనీ, విద్యార్థులకు నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. మండల విద్యాధికారి పద్మయ్య, ఆరోగ్య ఉప కేంద్రం వైద్యురాలు సాత్విక పర్యవేక్షణలో.. విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. నేడు మాత్రలు తీసుకోలేని వారికి, వారం రోజుల్లో మరోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆశావర్కర్లు అనిత, శారద ఉన్నారు.

# అర్హుల ఓట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించొద్దు

**అధికారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి సూచన**



**సైదాపూర్ జులై 13 ( పీపుల్స్ డైరీ ) :** అర్హులైన వారి ఓట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించవద్దని, కొత్తగా అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి కోరారు. సోమవారం రాంచంద్రాపూర్ గ్రామంలో చేపట్టిన ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో (బీఎల్వో) మాట్లాడి ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల స్థాయి సీనియర్ నాయకులు, యువజన విభాగం నేతలు, కార్యకర్తలు కలిసి చాడ కొండాల్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం సమ్మయ్య, నాయకులు ఆకుల రమేష్, బొల్లం రామచందర్, ఎండీ గౌస్‌పాషా, సుంకరి ఐలయ్య, సుంకరి రవి, ఎగ్గోజు సదానందాచారి, ఎండీ యాకూబ్, కొట్ట కొమురెల్లి, పున్నం సదయ్య, బీఎల్వో పున్నం తిరుపతితో కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే క్రమశిక్షణ



**హుస్నాబాద్ టౌన్; (పీపుల్స్ డైరీ) జులై 13 :**రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాయి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్" కార్యక్రమం సోమవారం హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఉత్సాహంగా జరిగింది. సిద్ధిపేట జిల్లా డీవైఎస్‌వో వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అథ్లెటిక్స్ కోచ్ రాజేష్, ఫెన్సింగ్ కోచ్ ఫణీంద్ర, వాలీబాల్ కోచ్ రిషిందర్ విద్యార్థులకు జనరల్ వార్మప్, కండిషనింగ్ వ్యాయామాలపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణతో క్రీడల్లో రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈఓ బండారి మనీలా చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. క్రీడలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయన్నారు. హుస్నాబాద్ బాలుర, బాలికల, మోడల్ స్కూల్, బెజ్జంకి మైనారిటీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని వార్మప్, కండిషనింగ్ వ్యాయామాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్ సిహెచ్. అనూష,జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి జె. వెంకట నర్సయ్య, పిడి ఆర్.శ్రీనివాస్, కబడ్డీ కోచ్ కృష్ణ, పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# చేపల వ్యాపారులకు తాత్కాలిక స్థలం ఏర్పాటు చేయాలి

- శాశ్వత నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని పూర్తి చేయాలి..
- గాదెపాక రవీందర్ హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 13 :**హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డులో పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 20 మంది ముదిరాజ్ చేపల వ్యాపారులు తమ కులవృత్తిగా చేపలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరితో పాటు మరో 15 మంది కార్మికులు కూడా ఈ వ్యాపారంపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందనే కారణంతో చేపల వ్యాపారులను అక్కడి నుంచి వెళ్లాలని కాంట్రాక్టర్ ప్రతినిధులు సూచించినట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హుస్నాబాద్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ 17వ వార్డు కౌన్సిలర్ గాదెపాక రవీందర్ ఆ స్థలాన్ని సందర్శించి చేపల వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవనోపాధి కోసం ఎన్నో ఏళ్లుగా అక్కడే చేపల విక్రయాలు చేస్తున్న వారిని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులు కొనసాగించే క్రమంలో వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే సమీపంలో తాత్కాలిక స్థలాన్ని కేటాయించి, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు అదేవిధంగా, 2022లో రూ.2.75 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన నాన్‌వెజ్ మార్కెట్ భవనం ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడం బాధాకరమన్నారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, అదే సమయంలో అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని కూడా పూర్తి చేసి చేపల వ్యాపారులకు శాశ్వతంగా దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను కోరారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని మా చేపల వ్యాపారుల జీవ-నోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ స్థలాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి శాశ్వత వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలికంగా సరైన స్థలం, అవసరమైన సౌకర్యాలు కల్పించి, అనంతరం నాన్‌వెజ్ మార్కెట్ భవనం పూర్తయిన తర్వాత అందులో శాశ్వతంగా షాపులు కేటాయించాలని చేపల వ్యాపారులు మున్సిపల్ అధికారులను కోరారు.

# రోడ్డు ప్రమాదంలో ముత్తారం గ్రామానికి చెందిన వ్యక్తి దుర్మరణం



**భీమదేవరపల్లి జూలై 13 (పీపుల్స్ డైరీ ) :** ఎలుకతుర్తి మండల పరిధిలోని గాంధీ నగర్ మోడల్ స్కూల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన పోగుల ప్రసాద్ (పద్మశాలి) అనే వ్యక్తి ఎలుకతుర్తి నుండి ముల్కనూర్ వైపు వెళ్తుండగా, గాంధీ నగర్ మోడల్ స్కూల్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదం లో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎలుకతుర్తి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, ప్రమాదానికి గల పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# మాలపల్లిలో రైతు, ఓటరు అవగాహన కార్యక్రమం



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 13 :** హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరుతడి పంటల సాగు, మేలురకం పత్తి ఎంపికపై రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు అందించారు. గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రైతులకు పంటల నిర్వహణ, అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో గ్రామ చెరువులో ఫిష్ ఫండ్ అభివృద్ధి పనులను ప్రారంభించారు ఇదే సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్నరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ సరోజన, పంచాయతీ కార్యదర్శి దివ్య పాల్గొని ఓటర్లకు అవసరమైన వివరాలు తెలియజేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని ఎండోమెంట్ శాఖలో చేర్చాలి



**వీణవంక జులై 14( పీపుల్స్ డైరీ) :** మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా ఎంతో విశిష్టత కలిగిన దేవాలయంగా భక్తుల విశ్వాసాన్ని పొందుతోంది. ఈ ఆలయంలోని గర్భగుడిలో ఆంజనేయస్వామితో పాటు పరమశివుడు, నందీశ్వరుడు కొలువై ఉండటం అత్యంత అరుదైన విశేషంగా స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో గర్భగుడిలో శివలింగం, నందీశ్వరుడు కలిసి దర్శనమివ్వడం చాలా అరుదు. అయితే రామకృష్ణాపూర్ గ్రామంలోని ఈ ఆలయంలో ఆ విశిష్టత ఉండటంతో ఇది ప్రత్యేక ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తింపు పొందింది. పురాతన కాలం నుండి గ్రామ ప్రజలు ఈ ఆలయాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ వస్తున్నారు. మాస శివరాత్రి, శివరాత్రి, హనుమాన్ జయంతి వంటి పర్వదినాల సందర్భంగా గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయ విశిష్టత గురించి తెలుసుకున్న భక్తులు ఎంతో భక్తి భావంతో దర్శించుకొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ ఆలయంలో నిత్య పూజలు, పరిరక్షణకు సరైన ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు, ఎండోమెంట్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ పురాతన దేవాలయాన్ని ఎండోమెంట్ శాఖ పరిధిలోకి తీసుకొని ప్రతిరోజు నిత్య పూజలు, అభిషేకాలు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విశిష్ట ఆలయానికి ప్రభుత్వ పరిరక్షణ లభిస్తే భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక వారసత్వంగా నిలిచి మరింత గుర్తింపు పొందుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతునరూ

# వర్షాలు కురవాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**కోహెడ జులై 13 (పీపుల్స్ డైరీ) :** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ ఆరేపల్లి గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్థులు వినూత్నంగా గ్రామదేవతల కు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలునిర్వహించారు. వర్షాలు లేక వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో పాటు ఎండల తీవ్రత పెరగడం తో ఈ కార్యక్రమం చేపట్టారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.


# నేషనల్ డి వార్మింగ్ డే సందర్బంగా ఆల్బెండజోల్ టాబ్లెట్ ల పంపిని



**వీణవంక జులై14( పీపుల్స్ డైరీ)** మండలం లోని హిమ్మత్ నగర్ ఏంపి యుపిఎస్ పాఠశాలలో నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్ భోజన విరామ అనంతరం వారికి ఆశ వర్కర్ సరిత అందించడం జరిగింది. కార్యక్రమం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం నులిపురుగుల దినోత్సవం గురించి ఆల్బెండజోల్ టాబ్లెట్ వినియోగం గురించి దానివల్ల కలిగే ప్రయోజనాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జడల శ్రీకాంత్ ఉప సర్పంచ్ మేక శ్రీనివాస్ గ్రామ పాలకవర్గం చిలువేరు రమేష్ ఉపాధ్యాయుని రజిత అంగన్వాడీ టీచర్ స్వరూప ఆశ వర్కర్ సరిత సిపి మౌనిక ఆయమ్మ రాధమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

# రేగొండ ఎస్సై పై ఎస్పీ కి పిర్యాదు

**భూ వివాదంలో వేధిస్తున్నాడని పిటిషన్**



**రేగొండ జూలై 13 పీపుల్స్ డైరీ..** రేగొండ మండల కేంద్రంలోనీ రాయపల్లి గ్రామంలోని భూ వివాదంలో రేగొండ ఎస్సై సుధాకర్, తనపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాయపల్లి గ్రామానికి చెందిన జమ లాపురం బాబూరావు,సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కి పిర్యాదు చేశారు. గ్రామంలోని వ్యవసాయ భూమి వివాదంలో రెమిడీ మోహన్ రెడ్డి,అతని కుమారుడు నరేందర్ రెడ్డి,మీద బాబు రావు భార్య ఎస్సై సుధాకర్ కు గత నెలలో పిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేయకుండ తనపై అక్రమంగా కేసులు పెట్టీ భూ వివాదంలో జోక్యం చేసుకోవద్దు అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని,భూ వివాదంలో సదరు వ్యక్తి జోలికి వెళ్లకుండా ఉండాలని తనను బెదిరించారని పిటిషన్ లో తెలిపారు .ఈ విషయంపై గణపురం సి ఐ కరుణాకర్ రావు,కి కేసు బదిలీ చేసిన ఎస్పీ. కాగా సి ఐ కేసు పూర్వాపరాలు పరిశీలించి జరిగిన సంఘటనలో ఎస్సై సుధాకర్ ను విచారించి న్యాయం జరిగేలా చూస్తానని పిటిషన్ దారుణికి హామీ ఇచ్చినట్టు బాబు రావు తెలిపారు..

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన




**గణపురం, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను 255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపిఈ జెఏసి పిలుపు మేరకు సోమవారం 18వ రోజు భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా, పనిభారం అసమానంగా పెరగడం, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిహెచ్ పి, ఏహెచ్ పి ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల హక్కులకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ప్లాంట్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలను అవుట్‌సోర్సింగ్ లేదా ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు ఇది నాంది కావచ్చని హెచ్చరించారు. ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం తమ డిమాండ్ లను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల ఇంజనీర్స్ అసోసియేషన్ ల ప్రతినిధులు, ఉద్యోగులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చలేకనే మంత్రుల పర్యటన రద్దు

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి**



**పినపాక, జూలై 13,(పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన రద్దు చేసుకున్నారని బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి ఆరోపించారు.సోమవారం పినపాక మండలం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సీతారామ ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 31 నెలలు గడిచినా ముందుకు తీసుకెళ్లలేదన్నారు.పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపు మేరకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని వినతిపత్రం అందజేయాలని నిర్ణయించగా, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.రైతులకు యాప్ విధానాన్ని రద్దు చేసి నేరుగా ఎరువులు అందించాలని, సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, సీనియర్ నాయకులు దాట్ల వాసుబాబు, సహకార సంఘ చైర్మన్ రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, కొండేరు రాము, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కాయం శేఖర్, రాయల బాబు తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ





**ఏన్కూరు జులై 13 పీపుల్స్ డైరీ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏనుకూరు వైద్యాధికారి డా. బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు, నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఔషధం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గడం, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడం, శారీరక మరియు మానసిక ఎదుగుదల మెరుగుపడడం వంటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) భాగ్యశ్రీ , కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వార్డెన్లు, ఇతర కేజీబీవీ సిబ్బంది, అలాగే వైద్య మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని బురద రాఘవపురం పాఠశాల లో కూడా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సాగి సుజాత,ఉపాధ్యాయ సిబ్బంది,ఏ ఎన్ ఎం శ్యామల తేజ, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ



**కేసముద్రం జూలై 13 (పీపుల్స్ డైరి )** మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో సోమవారం ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలు వేయడంతో పాటు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాభ్యాసంలో మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకున్నారు.

## ఇల్లందు ఆర్టీసీ డిపో ఎస్డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 13 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు ఆర్టీసీ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూఎఫ్--సీఐటీయూ) ద్వితీయ మహాసభలో నూతన డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాళ్లూరి కృష్ణ, అధ్యక్షుడిగా డి. అంజయ్య, కార్యదర్శిగా ఐ. వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి. లక్ష్మణరావు, ఎస్.కే. నసీరుద్దీన్, సహాయ కార్యదర్శులుగా ఎ. అశోక్, కె. కోటయ్య, బి. హనుమ నాయక్, ఖజాంచీగా వి. నాగరాజు, ప్రచార కార్యదర్శిగా కె. ఉపేందర్‌రావు, మహిళా కన్వీనర్‌గా వి. శైలజ ఎన్నికయ్యారు. డెలిగేట్లుగా సైదమ్మ, ఈ. మహేశ్వరి, డి.వి. లక్ష్మి, ఉమారాణి, మమత, చైతన్య, ఎస్.ఎ. అలీ, వి. వెంకటయ్య, సురేష్, జి.ఎస్. రావు, ఐ.ఎన్. రావు, ఆర్.ఎన్. రావు, డి. కాంతారావు (మెకానిక్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మహాసభలో ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# దేవాదుల ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

- ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదు
- 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతాం
- దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం
- 38.16 టీఎంసీల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తాం
- భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణ అమలు
- పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేశాం
- సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క

















ములుగు ప్రతినిధి, జూలై 13(పీపుల్స్ డైరీ): దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగిస్తామని, 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు.

సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వస్సల్ టోప్పో, డి ఎఫ్ ఓ వికాస్ మీనాలు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ముగ్గురు మంత్రులు కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కా రావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు.

అనంతరం సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో, చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.

దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత కీలక ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పంపింగ్ వ్యవస్థ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూసేకరణ, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అధికారులతో కలిసి ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లలో వివిధ దశల్లో నీటిని నింపుతున్నామని, ఒక్క రిజర్వాయర్ కూడా ఖాళీగా ఉండకుండా పూర్తి సామర్థ్యంతో నింపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.

దేవాదుల ప్రాజెక్టు ద్వారా సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఇందులో దాదాపు 92 శాతం ఆయకట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉండగా, మిగిలిన భాగం నల్లగొండ జిల్లాలో విస్తరించి ఉందన్నారు.

ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నందుకు ప్రజా ప్రభుత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులున్నారు.

## వీవోఏల హామీలు వెంటనే అమలు చేయాలి

**సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం.. రూ.18 వేల కనీస వేతనం సహా పలు డిమాండ్లు**



ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 13 (పీపుల్స్ డైరీ) : ఐకేపీ వీవోఏలకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) డిమాండ్ చేసింది. సంఘం ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏటీఎం రామకృష్ణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా నాయకురాలు సుల్తానా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్లాబీ మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా వీవోఏలు గ్రామీణ పేదరిక నిర్మూలన, మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు లింకేజీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం--ప్రజల మధ్య వారే వారధిగా పనిచేస్తున్నప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. వీవోఏలకు నెలకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగులుగా గుర్తించాలని, సెల్ఫ్ సర్క్యులర్ మేరకు గ్రామ సంఘాల నుంచి వేతనాలు పెంచాలని, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, ఆదాయం లేని గ్రామ సంఘాలకు రూ.20 లక్షల ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే రూ.10 లక్షల ఆరోగ్య బీమా, గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాల అమలు, ఆన్‌లైన్ పని విధానం రద్దు, వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, తాళ్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వానదేవుడా.. కరుణించవా..!

- చినుకు కోసం భూలక్ష్మి అమ్మవారికి మహిళల జలాభిషేకం..
- వానాకాలం సగం గడిచినా చినుకు జాడలేదు..
- ఎండిపోతున్న విత్తనాలు.. ఆందోళనలో రైతులు
- పచ్చని పంటల కోసం భక్తితో వరుణుడిని వేడుకున్న మహిళలు


**గణపురం, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** వానాకాలం సగం దాటినా వరుణుడు కరుణించకపోవడంతో గణపురం మండలంలో రైతాంగం తీవ్ర ఆందోళనలో పడింది. వర్షాభావ పరిస్థితులతో పంటల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో గ్రామస్థులు ఆధ్యాత్మిక మార్గాన్ని ఆశ్రయించారు. మండల కేంద్రంలోని మహిళలు సోమవారం గ్రామదేవత భూలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, రైతులు కలిసి అమ్మవారిని ప్రార్థిస్తూ గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి, సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలని వేడుకున్నారు. గత నెల రోజులుగా ఆశించిన స్థాయిలో ఒక్క గట్టి వాన కూడా పడకపోవడంతో పొలాల్లో వేసిన విత్తనాలు నేలలోనే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే సాగు పనులు ప్రారంభించిన రైతులు విత్తనాలు, ఎరువులు, దుక్కి ఖర్చుల కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, ఇప్పుడు పంటలు మొలకెత్తకపోవడంతో తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. సాగునీటి కోసం బోర్లపై ఆధారపడినా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చాలా బోర్లలో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. కొన్ని బోర్లు పూర్తిగా ఎండిపోగా, మరికొన్నింటిలో వచ్చే నీరు పంటలకు ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ మహిళలు భూలక్ష్మి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతుల కష్టాలు తీర్చాలని, ఎండిపోయిన పొలాలు మళ్లీ పచ్చదనంతో కళకళలాడాలని, పంటలు సమృద్ధిగా పండించి అన్నదాతను ఆదుకోవాలని భక్తిపూర్వకంగా ప్రార్థించారు. గ్రామమంతా త్వరలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని, ప్రతి రైతు ఇంట ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటూ పూజలు ముగించారు.





## బిఎల్వోలకు గౌరవ వేతనం అందించాలి

**జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్**



**చిట్యాల, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** సర్ ఓటర్ల సమగ్ర సవరణ సర్వేలు చేస్తున్న సందర్భంగా వారికి గౌరవ వేతనంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తామన్న వెయ్యి రూపాయలు అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న 500 రూపాయలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిఎల్ఓ లకు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం సరైనది కాదు అని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు.

2025 మార్చి నుండి ఇప్పటి వరకు వారికి వేతనాలు లేవని కాని ఎస్ఐఆర్ సర్వే చేయాలని మాత్రం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారని వాళ్లకు తక్షణమే గౌరవ వేతనం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితాన్ని ఇవ్వకుండా శ్రమ దోచుకుంటున్నారని వారికి గౌరవ వేతనాలను అందించకుంటే అందర్నీ సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# 30 ఏళ్ల కల సాకారం..

# కేసముద్రం మార్కెట్‌లో 2 కోట్లతో ఫైర్ స్టేషన్ ప్రారంభం

**కేసముద్రం, జూలై 13 (పీపుల్స్ డైరి):** అయ్యో మళ్ళీ మంటలు వచ్చాయి.. ఫైర్ బ్రిగేడ్ మహబూబాబాద్ నుండి వచ్చేలోపే అంతా అయి పోతుంది" అని గతంలో ప్రజలు ఆందోళన పడేవారు. కానీ నేడు ఆ దృశ్యం మారింది. మండల ప్రజల 30 ఏళ్ల కల నేడు సాకారమైంది కేసముద్రం మార్కెట్ ప్రాంతంలో సుమారు 2 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన అగ్నిమాపక ఫైర్ స్టేషన్ ను రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఘనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేసముద్రం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కల ఇది. ఇకపై అగ్ని ప్రమాదం జరిగిన 10 నిమిషాల్లోనే మా సిబ్బంది స్పందించి ప్రాణాలు, ఆస్తులను కాపాడతారు అని భరోసా ఇచ్చారు. ఈ స్టేషన్ ద్వారా కేసముద్రం మండలంతో పాటు చుట్టు పక్కల 20 గ్రామాలకు తక్షణ సేవలు అందుతాయని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అధునాతన ఫైర్ ఇంజన్లు, రెస్క్యూ పరికరాలతో కూడిన స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కొత్త ఫైర్ ఇంజన్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి, సిబ్బంది మాక్ డ్రిల్ ను పరిశీలించారు. సిబ్బంది చురుకుదనాన్ని అభినందించిన ఆయన, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో 101 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్టేషన్ ప్రారంభంతో కేసముద్రం ప్రజలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఇన్నాళ్లకు మాకు ఒక దిక్కు వచ్చింది అంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎస్పీ డాక్టర్ శబరీష్ జిల్లా అధ్యక్షురాలు ఉమా మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి భరత్ చందు రెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీత వెంకన్న వైస్ ఛైర్‌పర్సన్ అల్లం రమనాగేశ్వరావు అంబటి మహేందర్ రెడ్డి బండారు దయాకర్ బండారు వెంకన్న సమ్మి గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## కాట్రపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి

కేసముద్రం, జూలై 13 (పీపుల్స్ డైరి): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాముఖ్యత ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. దళిత, బహుజన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ గుగ్గిళ్ల పీరయ్య డా. వివేక్ నీలం దుర్గేష్ మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి గ్రామ సర్పంచ్ సూరయ్య ఉపసర్పంచ్ యాదగిరి జెల్లే యాకంబ్రం లిజెల్లే రవీందర్



పుల్ల శ్రీనివాస్ యాదవ్ జెల్లే కరుణాకర్ తదితర నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలి

**విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**మొగుళ్ళపల్లి జూలై 13 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ఎం జె పి పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు పాల్గొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని అన్నారు. సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు జాతీయ నులిపురుగుల నివారణ , కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సోమవారం పర్యటించారు. మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపులే (వీజీపీ) గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ. జిల్లాలో డెబ్బై వేల ఏడువందల డెబ్బై మూడు మంది విద్యార్థులకు నట్టల మందు పంపిణీ చేయడం జరుగుతుందని విద్యార్థులు అందరూ తప్పకుండా ఆరోగ్యంగా ఉండేందుకు నట్టల మందు వేసుకోవాలని సూచించారు. మొగుళ్లపల్లి ఎంజేపి పాఠశాలలో సుమారు 1000 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారని ఈమధ్య పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ మా దృష్టికి తీసుకురావడం జరిగిందని సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానిక సర్పంచ్, విద్యుత్ అధికారులకు సూచించారు. మెయిన్ రోడ్డు నుండి పాఠశాల లోపలి వరకు సీసీ రోడ్డు కావాలని అడగడం జరిగిందని నిధులను మంజూరు చేసామని సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ తొందర్లోనే సీసీ రోడ్డును ప్రారంభించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల కాస్మెటిక్, మెస్ ఛార్జీలను పెంచి నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**మొగుళ్లపల్లి మండలంలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

మొగుళ్ళపల్లి మండలంలో 26 మంది లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా, రైతు బీమా, రైతు బోనస్, మహాలక్ష్మి పథకం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు లాంటి సంక్షేమ పథకాల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తోందన్నారు.

**అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే**

కొరికిశాల, ఎల్లారెడ్డిపల్లి మొగుళ్లపల్లి ఇసిపేట గ్రామాలలో అంతర్గత సిసి రోడ్లను భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులుగండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం అంతర్గత సిసి రోడ్లను మంజూరు చేసి నేడు ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

**కొరికిశాల కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే**

భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, భోజన సదుపాయాలు, వసతి ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, డిఎంహెచ్ఓ మధుసూదన్ మండల తహసీల్దార్, జాలి సునీత, పీఏసీఎస్ చైర్మన్, సంపెల్లి నరసింగరావు, చిట్యాల ఏఎంసి వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, ఆర్ ఐ శివరామకృష్ణ ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు, పోలినేని లింగారావు, క్యాతరాజు రమేష్, మోటే ధర్మారావు వెల్లదండి చంద్రబోస్, యారా అజయ్ రెడ్డి నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.








# 15 రోజుల్లో అర్హులందరికీ అక్రిడిటేషన్‌లు

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర స్పందన
- జర్నలిస్టుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ భారీ ఆందోళన
- 15న హైదరాబాద్ సమాచార భవన్ ఎదుట ఆందోళనకు తరలి రావాలి
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ లు 15 రోజుల్లో ఇస్తామని టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా సమాచార శాఖ అధికారికి ఆదేశాలు జారీచేశారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్-2843) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ముందు సోమవారం వందమందికి పైగా జర్నలిస్టులు గంటసేపు భారీ ఆందోళన నిర్వహించారు.

**-జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు:**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరాటం నిర్వహిస్తామని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు తెలిపారు. 15న హైదరాబాద్ లోని సమాచార శాఖ కమిషనరేట్ వద్ద నిర్వహించే ఆందోళనకు ఖమ్మం జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ ప్రభుత్వం ఏర్పాటులోనూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులోనూ జర్నలిస్టులు క్రియాశీలకంగా పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పని తీరుకు తగ్గట్టుగా రాత్రనకా, పగలనకా నిరంతరాయంగా పనిచేస్తున్న జర్నలిస్టులు నేడు చాలీచాలని వేతనాలతో.. ఆర్థిక ఇబ్బందుల నడుమ కిరాయి ఇండ్లలో జీవనం కొనసాగిస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నాయే తప్ప.. ఆచరణలో పెట్టడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకూ హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ల ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వివిధ సర్టిఫికెట్ల పేరుతో రకరకాల కొర్రీలు పెట్టుతుండడం వల్ల పనిచేస్తున్న అనేకమంది జర్నలిస్టులు అక్రిడిటేషన్ లు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వాసాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టీబీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుకొండ రవికిరణ్, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, స్టేట్, జిల్లా కమిటీ సభ్యులు చీనేని బాలకృష్ణ, సంతోష్ చక్రవర్తి, నలుబోల మధుశ్రీ, షేక్ జానీపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, గణేష్, గంగాధర్, నాగిరెడ్డి, అంజయ్య, బంకా వెంకటేశ్వర్లు, నాయకులు యాస లక్ష్మారెడ్డి, బండి కుమార్, పత్తి శ్రీనివాస్, అంజద్, శరత్, అర్షద్, గోపీ కృష్ణ, అశోక్ రెడ్డి, వీసారపు అంజయ్య, ఉపేందర్, కె.కిరణ్, గోపీ, షకీల్, సునీత, నాగలక్ష్మి, చంద్రశేఖర్, ధనాలకోట రవి కుమార్, జావీద్, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణ, తదితరులున్నారు.





## ఘనంగా 'జాతీయ నులిపురుగుల దినోత్సవం'

**పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్**

**కరకగూడెం,జూలై 13(పీపుల్స్ డైరీ ) :** వట్టం గారి గుంపు పంచాయతీ పరిధిలో గల అంగన్వాడి మరియు ప్రైమరీ స్కూల్ లో "జాతీయ నులిపురుగుల దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సందీప్, ఉప సర్పంచ్ లావణ్య మరియు వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు. విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, శానిటేషన్ పాటించడం వల్ల అనారోగ్యాలను నివారించవచ్చని సర్పంచ్ సందీప్ తెలిపారు. ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఇలాంటి కార్యక్రమాలు తప్పనిసరి అని ఉప సర్పంచ్ లావణ్య అన్నారు



# మాదన్నపేటకు సత్వరమే నీటిని అందిస్తాం..

**మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్....**

**నర్సంపేట పీపుల్స్ డైరీ జూలై 13 :** నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన మాదన్నపేట 1వ వార్డులోని రెండు నల్లాల బావులు నీరు లేక పూర్తిగా ఎండిపోవడంతో నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రోజు మాదన్నపేట స్థానిక కౌన్సిలర్ కొత్తకొండ మేఘన-శ్యామ్ కలిసి బావులను పరిశీలించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ .. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ వర్షాకాలం మొదలై గత కొన్ని రోజులుగా వర్షాలు కురవక మాదన్నపేటకు నిత్యం నిరంధించే బావులు ఎండిపోగా శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో మాదన్నపేట చెరువు నుండి మోటర్లు పైపుల ద్వారా భావులను నింపి నీరు అందించే చర్యలు నేటి నుండే చేపట్టడం జరిగిందని రేపటి నుండి మాదన్నపేటకు సరిపడే నీటిని అందిస్తామని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు బీరం భరత్ రెడ్డి, పున్నం నర్సింహారెడ్డి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..





# కళా మహోత్సవం అవార్డుతో డాన్స్ మాస్టర్ వెంకటేష్‌కు గౌరవం

**21 ఏళ్ల కళాసేవకు గుర్తింపు.. అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటిన ఇల్లందు కళాకారుడు**






**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 13 (పీపుల్స్ డైరీ) :** నృత్య రంగంలో రెండు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందిస్తున్న ఇల్లందుకు చెందిన సీనియర్ డాన్స్ మాస్టర్ కదారి వెంకటేష్ ప్రతిష్ఠాత్మక 'కళా మహోత్సవం అవార్డు' అందుకున్నారు. కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కళా మహోత్సవం కార్యక్రమంలో మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు యాదవ్, ఆదివాసీ నాయకుడు ఆరం ప్రశాంత్ సమక్షంలో నిర్వాహకులు డాక్టర్ కళ్యాణ్ సుమిత్ర ఈ అవార్డును ప్రదానం చేశారు. వెంకటేష్ 2006లో ఈటీవీ 'ధూమ్', జెమినీ టీవీ 'డాన్స్ బేబీ డాన్స్' కార్యక్రమాల ద్వారా సైడ్ డాన్సర్‌గా కళారంగ ప్రవేశం చేశారు. అనంతరం వేలాది స్టేజ్ ప్రదర్శనలతో పాటు పలు తెలుగు చిత్రాల్లో సైడ్ డాన్సర్‌గా పనిచేసి గుర్తింపు పొందారు. సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో డ్యూయెట్ విభాగంలో బహుమతి సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ప్రస్తుతం 'వెంకట్ డాన్స్ అకాడమీ' ద్వారా వందలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న ఆయన, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలను నిర్వహిస్తూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నృత్య పోటీలకు న్యాయనిర్ణేతగా కూడా సేవలందిస్తున్నారు. వెంకటేష్‌కు కళా మహోత్సవం అవార్డు లభించడంపై నృత్య కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాంత్ మాస్టర్, సాయి మాస్టర్, శేఖర్ మాస్టర్, రాజేష్ మాస్టర్, అరుణ్ మాస్టర్ తదితరులు ఆయనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## ఏ శాఖా పట్టించుకోవట్లే..!

- మీరైనా న్యాయం చేయండని వేడుకోలు...
- కలెక్టర్ ను ఆశ్రయించిన పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులు

**నర్సంపేట పీపుల్స్ డైరీ జూలై 13 :** ప్రైవేట్ స్కూళ్ళలో వసూలు చేస్తున్న అధిక ఫీజులు, సౌకర్యాల లేమిని ప్రశ్నిస్తూ నర్సంపేటలో పేరెంట్స్ అసోసియేషన్ కొన్ని రోజులుగా పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారి మొదలు, రెవెన్యూ, ఫైర్, పోలీస్ సహా తదితర సంబంధ శాఖలకు పలు దఫాలుగా వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు చదువుకునే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అధిక ధరలకు, చెప్పిన దగ్గరే కొనాలంటూ హుకుం జారీ చేస్తుండటం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాక్స్, షూ మొదలు విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు (స్కూల్ పేరుతో బ్యాగ్స్) ఒక షాపు ఏర్పాటు చేసి విక్రయించడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు పేరెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ప్రైవేట్ స్కూళ్లు చేస్తున్న దోపిడీపై పోరాడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ లేదని ఆరోపించారు. నర్సంపేట పట్టణంలోని పలు శాఖల దృష్టికి తీసుకెళ్లినా స్పందన శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. పలు అంశాలను పేర్కొంటూ న్యాయం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారదకు, డీ.ఈ. ఓ కు వినతి పత్రం అందజేశారు.




## భరోసా యాత్రకు భారీగా తరలిన బిజెపి శ్రేణులు

**చిట్యాల, జూలై 13 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి భూపాలపల్లి పర్యటనలో భాగంగా సోమవారం చిట్యాల మండలం నుండి 500 మందికి పైగా బీజేపీ కార్యకర్తలు సింగరేణి భరోసా యాత్రకు తరలి వెళ్లారని బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జెండా ఊపి వాహన శ్రేణిని ఆయన ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మండల నాయకులు శక్తి కేంద్ర ఇన్చార్జీలు బూత్ అధ్యక్షులు అభిమానులు సానుభూతిపరులు పాల్గొన్నారు.



## ఏన్కూరు శివాలయంలో అభిషేకాలు

**ఏన్కూరు జూలై 13 పీపుల్స్ డైరీ :** సోమవారం మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని 10 సంవత్సరాలకు ఒక పర్యంతం వచ్చేటువంటి అరుదైనటువంటి ఇలాంటి శుభదినం ఈశ్వరుడికి పాలు సమర్పించిన లేదా మారేడు దళం సమర్పించిన మన స్వామి దర్శనం చేసుకున్న సకల పుణ్య ప్రాప్తి కోటి జన్మల దరిద్రం నివారణ జరుగుతుందని శాస్త్ర వచనం ఈ సందర్భంగా ఏనుకూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకములు మరియు స్వామివారికి పంచ హారతులు అదే విధంగా స్వామివారికి విశేష అర్చన కైంకర్యాలు స్వామి వారికి జరిగాయి ఈ కార్యక్రమంలో భక్తులు తండోపతండాలుగా గ్రామ ఏనుకూరు మండల ఇతర ప్రాంత భక్తులందరూ కూడా విస్తృతంగా పాల్గొని స్వామివారి కృపాకటాక్షానికి పాత్రులు అయ్యారు



## వెంకటాపురం-చర్ల రహదారిపై ధర్నా..

**నూగురు వెంకటాపురం, జూలై 13(పీపుల్స్ డైరీ) :** ధ్వంసం అయిపోయిన వెంకటాపురం - చర్ల ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టి పూర్తి అయ్యేంతవరకు ఇసుక లారీలను నిలిపివేయాలంటూ బిఆర్ఎస్, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రెండు పార్టీల ఆధ్వర్యంలో ఆలుబాక గ్రామం వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెండు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. 45 కిలోమీటర్ల మేరకు రహదారి పూర్తి ధ్వంసంగా మారిందని ఆరోపించారు. గుంతల మయంగా మారిన రహదారి కారణంగా ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు, గర్భిణీలు అనేక ఇబ్బందులను ఎదురుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన రాస్తారోకో కారణంగా అనేక వాహనాలు నిలిచిపోగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com